# 23. గయక్వాడ్ కథ

ఈనాడు భారత క్రికెట్ రంగంలో ప్రసిద్ధుడుగా నున్న గయక్వాడ్ పూర్వీకులు మరొకందుకు చరిత్ర ప్రసిద్ధులు.

హిజ్ హైనెస్, ఫర్జాంద్ ఇఖాన్, దౌలత్-ఇ-ఇంగ్లీషియా, మహారాజా శాయాజీరావు గయక్వాడ్, సేనాఖాన్ ఖేల్ షంషేర్ బహదూర్ వారు బ్రిటిష్ వారిచే అనేకానేక బిరుదులు పొందిన బరోడా సంస్థానాధీశులు చరిత్ర ప్రసిద్ధులైన మరాఠా యోధుల వారసులు.

వారు బ్రిటిష్‌వారి పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ శాస్త్రోక్తంగా పాలనా విద్య నభ్యసించారు. శ్రీవారిని ప్రభుభక్తి పరాయణులుగా నిలిపి ఉంచేందుకుగాను బ్రిటిష్‌వారు కూడా వారికి అనేకానేక బిరుదులు, ప్రత్యేక సౌకర్యాలు ఇచ్చి చూసేరు.

కానీ మహారాజా శాయాజీరావు సదా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వతంత్రాభిప్రాయాల్నే వెలిబుచ్చి బ్రిటిష్‌వారి కన్నెర్రకు గురవుతూండేవారు ఆ రోజుల్లో తిరుగులేని శక్తిగా బలపడుతూ భారతదేశమంతటా తన పెత్తనాన్ని విస్తరింపజేస్తూన్న బ్రిటిష్ చక్రవర్తికి ఎదురు చెప్పటానికి సంస్థానాధీశులే భయపడుతూండేవారు.

అయినా మహారాజా శాయాజీరావు గయక్వాడ్ మాత్రం సదా నిర్భయులే.

1911లో ఏడవ ఎడ్వర్డు ప్రభువు సింహాసనాధీశుడైన సందర్భంగా భారతదేశ పర్యటనకు వేంచేశారు. ఢిల్లీలో బ్రహ్మాండమైన

దర్బార్ ఏర్పాటుచేసి బ్రిటిష్ వారికి సామంతులైన సంస్థానాధీశులకూ, ఇతర మహారాజులకూ కూడా ఘనంగా ఆహ్వానాలు పంపేరు.

ఆ చరిత్రాత్మకమై దర్బార్‌లో మహారాజా శాయాజీరావు గయక్వాడ్ ఏం చేశారంటే !

ఆ దర్బార్‌లో రాజ లాంఛనాల ప్రకారం ప్రతిరాజూ మహారాజూ, సవినయంగా చక్రవర్తి సమక్షానికి వెళ్ళి వంగి సలాంచేసి, అలాగే ఏడడుగులు వెనక్కునడిచి అప్పుడు వెనక్కు తిరిగి, తనకై కేటాయించిన ఆసనం వద్దకు చేరాల్సివుంది. అది రాచ సాంప్రదాయం. అలా చేస్తే గానీ చక్రవర్తిపట్ల భారతీయులకుగల గౌరవాభిమానాలు, సామంతత్వం వెల్లడిగావని బ్రిటిష్ వారి నిశ్చితాభిప్రాయం. అందుకని భారతదేశంలోని బ్రిటిష్ వైస్రాయ్ ఈ దర్బార్‌లో రాజులూ, మహారాజులూ ప్రవర్తించవలసిన తీరునూ, ధరించాల్సిన దుస్తుల వివరాలనూ తెలుపుతూ ప్రత్యేకంగా ఓ తాకీదును జారీ చేసి ఉన్నాడుకూడా.

కానీ, హిజ్ హైనెస్, ఫర్‌జాంద్ ఇఖాన్, దౌలత్ ఇ-ఇంగ్లీషియా, మహారాజా శాయాజీరావు గయక్వాడ్, సేనాఖాస్‌ఖౌల్ షంషేర్ బహాదూర్ వారు సదరు నియమాలన్నింటినీ నిర్భయంగా ధిక్కరించేరు. మరెవరూ చేయని విధంగా చరిత్రాత్మకంగా బ్రిటిష్ చక్రవర్తిని నువ్వెంత అన్నట్లు పరామర్శించేరు.

ఆ సుదినాన మహారాజా శాయాజీరావు మామూలు తెల్లకోటు, వదులు పైజమా, చరిత్ర ప్రసిద్ధమైన మరాటా తలపాగాతో, చేతిలో కర్ర ఊపుకుంటూ షికారుకు వేం చేసిన వారిలా దర్బార్‌లో ప్రవేశించేరు.

సభాసదులెల్లరూ మ్రాన్పడి చూస్తూండగా, వైస్రాయ్ పళ్ళు కొరుక్కుంటూండగా శ్రీవారు చేతికర్ర ఊపుతూ, నెమ్మదిగా అడుగులు

వేస్తూ చక్రవర్తి ఆసనాన్ని సమీపించారు. రత్నఖచితమైన సింహాసనంపై ఆశీనులై ఉన్న బ్రిటిష్ చక్రవర్తికి దిగ్భ్రమ కొల్పేలా వారికి అభిముఖులై చేకర్రను ఎత్తి దానితోనే శాల్యూట్ చేసి, వెనక్కు తిరిగి చకచకా నడచి దర్బార్ హాల్ నుండి నిష్క్రమించేరు. చేతికర్రను గిరగిరా త్రిప్పు కుంటూ మహాసరదాగా, జల్సాగా, ఖుషీగా మరీ నిష్క్రమించేరు. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఇందుకుగాను దర్బార్‌లోని బ్రిటిష్ వారిచే అదివరకే కోరలు పీకించుకున్న మహారాజు లనేకులు లోలోనే సంతసించేరు. మహారాజా శాయాజీరావు గయక్వాడ్‌ను లోలోనే అభినందించుకున్నారు. ఆపాటి ధైర్య సాహసాలు తమకు లేనందుకు చింతించేరు.

కానీ, ఇంగ్లాండ్‌లో మాత్రం గగ్గోలు రేగింది. అక్కడి పత్రికలు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించి బ్రిటిష్ చక్రవర్తికి భారతదేశంలో మహావమానం అంటూ సంపాదకీయాలు రాసేయి. ఈ సందర్భంగా తీసిన డాక్యుమెంటరీ ఫిల్మ లండన్ స్కాలా థియేటర్లో ప్రదర్శిస్తూండగా ఈ ఘట్టం చూసిన ప్రేక్షకులు "సిగ్గు... సిగ్గు... గయక్వాడ్‌ను సింహాసనం నుండి లాగిపారేయాలి" అని కేకలు వేసేరు. వారిని "ప్రశాంత పరచి శాంతిభద్రతలను నెలకొల్పేందుకు" పోలీసులకు చాలా టైం పట్టిందట కూడా.

ఇదిలా ఉండగా భారతదేశంలోని బ్రిటిష్ వైస్రాయి మహారాజా శాయాజీరావు గయక్వాడ్‌కు ఒక శ్రీముఖం పంపేరు.

"అయ్యా! తమకు ఫర్‌జాద్ ఇఖాస్, దౌలత్ ఇ-ఇంగ్లీషియా అనే బిరుదును ఇచ్చి ఘనంగా గౌరవించివున్నాం. ఆ బిరుదుకు అర్థం "బ్రిటిష్ సామ్రాజ్యానికి అత్యంత ప్రియాస్పదుడైన బిడ్డడు" అని గదా! మరి

తమరిలా ఎందుకు ప్రవర్తించారు? మీ బిరుదులను ఊడబీక మన్నారా ?"
అని.

మహారాజావారు ఆ శ్రీముఖానికి సమాధానం ఇచ్చారో లేదో గాని, సదరు లేఖను మాత్రం చింపకుండానే చెత్తబుట్టకు దాఖలు పరిచేరు

★